# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 41 సంచిక 1
పేజీలు 44
సెప్టెంబర్ 2021

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

దాశరథీశతకము ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.................................... 5
అమ్మమాట........................................ 7
అగస్త్య హృదయం ...................................9
శ్రీబాబు దివ్య వాణి ..................................11
నమ్మినవారికి నమ్మినంత... ........................14
ఛాందోగ్యోపనిషత్ సారము ....................17
శ్రీ లలితా పరా భట్టారికా..............................19
అసలు వస్తువు.................... ..........................21
బాబూజీతో అనుభవాలు ............................25
సాధన ...................... ..................................27
హనుమంతుడు........ ...................................28
ఎవరు అస్పృశ్యుడు? ...................................30
కైవల్యోపనిషత్ ... ........................................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.........................34
శ్రీ గుగ్గుల నాయనారు...................................35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

14) దారుణపాత కాబ్ధికి సదా బడబాగ్ని భవాకులార్తివి
స్తారదవానలార్చికి సుధారసవృష్టి దురంత దుర్మతా
చారభయంక రాటవికి జండకఠోరకుఠారాధార నీ
తారకనామ మెన్నుకొన దాశరథీ కరుణాపయోనిధీ!

భావం - నీ పేరు పాపమను సముద్రమునకు బడబాగ్ని వంటిది, సంసారమను కార్చిచ్చునకు అమృతపు వాన, దుర్మతాచారములకు గొడ్డలి మొన వంటిది. దాశరథీ కరుణాపయోనిధీ!




*మనస్సు యొక్క అస్థిరత్వం ఎలా బయట పడుతుంది?
*మహాత్ముల ఉపన్యాసాలు ఏం చేస్తాయి?
*రామ నామ మాధుర్యం ఎవరికి అందుతుంది?
*యమునా నది ఎందుకు నీలంగా వుంటుంది?
*వృద్ధ భక్తుడికి ఆరునెలలు ఒక క్షణం లాగా ఎందుకు అనిపించింది?
*సాత్విక కర్త ఎవరు?
*ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితిని పొందాలంటే ఏం చేయాలి?
*సొరకాయలోకి జొన్నలు ఎలా వచ్చాయి?
*భక్తిని వెల్లడి చేసే మార్గమేమిటి?
*ఉన్నదెవడు? పోయినదెవడు?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

23-11-1980

ఈరోజు ఉదయం 9గం. 30 ని॥లకు శ్రీ బాబూజీ దర్శనం ఇచ్చారు. ఇంతలో దాస్ అను భక్తుడు వచ్చాడు. ఆయన ఇదివరలో భగవంతుని ఉనికినే ప్రశ్నించినవాడు. మహాత్ములంటే అసహ్యించుకునేవాడు. శ్రీబాబు "ఆధ్యాత్మిక శక్తి ఎంత గొప్పదో మీకు ఇక్కడే నిరూపిస్తాను" అంటూ, గంభీరంగా "చూడండి, ఈయన దాస్‌గారు. భగవంతుడిని నమ్మేవాడు కాదు. కాని ఆయనకు కలిగిన కష్టాలు తొలగిపోవటానికి దీక్ష యిచ్చాను. ఈ దీక్ష చేస్తే ఫలితం ఉంటుందా?" అని ప్రశ్నించాడు. తప్పక ఉంటుందని చెప్పాను.



దీక్షని విశ్వాసంతో భక్తి శ్రద్ధలతో పూర్తి చేశాడు. అతని సమస్యలు తీరినవో లేవోగాని ఆ దీక్షద్వారా ఆధ్యాత్మికశక్తి అతనిలో ప్రవేశించి దాని మాధుర్యాన్ని రుచి చూపించింది.

చూడండి చూపుడువేలుని పంచదార పానకంలో ఉంచి ఆ వేలుని రుచిచూస్తే ఆ పానకం మాధుర్యం తెలుస్తుంది. కేవలం ఆ వేలే అంత మాధుర్యాన్ని కలిగిఉంటే ఇక ఆ పంచదార పానకం ఎంత మాధుర్యం కలిగి ఉంటుందో ఊహించగలరా! గాఢమైన విశ్వాసమే భక్తి.

ఒక వ్యక్తి వెంకటరమణుని దర్శనార్థం వెళ్ళాడనుకోండి. తిరిగి వచ్చిన తర్వాత 'ఎలా ఉంది నీ యాత్ర?' అని ప్రశ్నించామనుకోండి. ఒకడు తిరుపతిలో చల్లగా ఉందంటాడు. ఇంకొకడు తిరుపతిలో సీనరీ చాలా బాగుందనో, గార్డెన్స్ చాలా బాగున్నాయి అనో చెప్తాడు. కాని వెంకట రమణునిలోని దైవత్వాన్ని గురించి చెప్పడు. అది వారి వారి జన్మ సంస్కారాన్ని బట్టి ఉంటుంది. మన దాస్ కూడా లోగడ అలా

చెప్పినవాడే. కాని ఇప్పుడు అలా చెప్పడు. ఆధ్యాత్మిక శక్తి అలా చెప్పనివ్వదు" అని అన్నారు శ్రీ బాబూజీ.

భగవంతుడిని మనకు తోచిన విధంగా ఆరాధించటమే మన భక్తి వెల్లడిచేసే మార్గం. దానివలన మన వ్యక్తిత్వాన్ని కోల్పోతాము అని అనుకోవటం పొరపాటు. దానిద్వారా భక్తి విశ్వాసాలు పెంపొందుతాయి. మహాత్ముల ఉపన్యాసాలు మనస్సులో ముద్ర వేస్తాయి. పండితుల ఉపన్యాసాలు తాత్కాలికంగా రుచికరంగా ఉండచ్చు.

శ్రీ వివేకానంద ఒకసారి అనేకమంది పండితుల్ని కలుసుకున్నారు. అందరూ పరతత్త్వాన్ని గురించి ఉపన్యాసాలు దంచేవారు. అయితే శ్రీ వివేకానంద వారిని ఒకటే ప్రశ్నించాడు. 'మీరు భగవంతుడిని దర్శించారా?'

ఆ పండితులు సమాధానం చెప్పలేకపోయారు. ఆ తర్వాత శ్రీ రామకృష్ణ పరమహంసని దర్శించి అదే ప్రశ్న వేశారు.

వెంటనే ఆయన సమాధానం చెపుతూ "చూశాను నాయనా! ఇపుడు నీతో ఎలా మాట్లాడుతున్నానో అలాగే ఆ జగజ్జననితో మాట్లాడుతాను. ఎప్పుడూ మాట్లాడుతూనే ఉన్నాను" అన్నారు. అది అనుభవంతో కూడిన జ్ఞానుల సమాధానం. పండితులది పుస్తకానుభవం ఈ రెంటిలో ఏది గొప్పది?

ఒక డాబా మీద సింహం తలలోంచి నీరు క్రిందికి పడుతోందనుకోండి. ఆ విశిష్టత ఆ సింహం తలదా? లేక డాబాదా? లేక వర్షాన్నిచ్చిన మేఘానిదా? పండితులు పుస్తకాల్లో ఉన్న విషయాన్ని వివరిస్తారు. ఆ శాస్త్రాల్లో విషయాలు మహాత్ముల వాక్కులు.

కాబట్టి మహాత్ముల సందేశాలు భక్తుల మనస్సులో చెరగని ముద్ర వేస్తాయి. మరి ఆ గొప్పతనం గ్రంథానిదా? పండితునిదా? లేక మహాత్మునిదా?

# అమ్మమాట

- జపమాలా ప్రసాద

## కేవలం శాంత రూపోఽహం

మనం రోజంతా తిరిగి, తిరిగి అనేక పనులు చేసి అలసి పోతాము. అప్పుడు ఎప్పుడు మన ఇంటికి మనం వెడతామా అని చూస్తూ వుంటాము. ఎందుకని? ఎక్కడ తిరిగినా, తిరిగి మన స్వంత ఇంటికి మనం వస్తేనే హాయిగా వుంటుంది. అదే విధంగా రోజంతా అనేకానేక సంకల్ప వికల్పాలు చేసి చేసి అలసిపోయిన మన మనస్సుకి విశ్రాంతినిచ్చేది భగవద్ధ్యానం మాత్రమే. నిశ్శబ్దం నుంచే శబ్దాలు వచ్చాయి. తిరిగి శబ్దం నుండి మనం నిశ్శబ్దంలోకి వెళ్ళిపోవాలి. అదే ధ్యానమంటే. ఆ నిశ్శబ్దం నుండి మనకు ప్రణవం, అంటే ఓంకారం వస్తుంది. కనుక నిశ్శబ్దం నుండి



వచ్చే శబ్దం ఓంకారం. దానిని గుర్తించకుండా మనస్సు చేస్తున్న గారడీలు చూసి, అతలాకుతలం అయిపోతున్నారు మానవులు. నిశ్చలమైన నీటిలో ఒక ఎండుటాకు పడితే ఎలా వుంటుందో, విరిగిన అద్దంలో ప్రతిబింబం ఎలా వుంటుందో, నిరంతరం అవిశ్రాంతంగా సంకల్పాలు చేసే మనస్సు కూడా అలాగే గందరగోళంగా వుంటుంది. ఈ మనస్సులో జరిగే కదలికలు పైకి కనిపించవు. కానీ, మన మనస్సు యొక్క అస్థిరత్వం మన మాటల ద్వారా, చేష్టల ద్వారా, ప్రవర్తన ద్వారా బయటపడుతుంది. తద్వారా అనేక తప్పులు చేస్తాం.

అసలు మన ఇల్లు ఏది అంటే, అది ప్రశాంతతే అని చెప్పవచ్చు. మన స్వరూపమే 'శాంతం' అని చెబుతోంది రామతాపన్యోపనిషత్ - **కేవలం శాంత రూపోఽహం** అని. ఆ ప్రశాంత వాతావరణంలో మనలోనే వున్న ప్రణవ నాదం వినగలుగుతాము. మీరు చెవులు మూసుకుని వింటే, ఓంకారం వినబడుతుంది. మనలోనే వున్నది ప్రణవం. మనమూ ప్రణవం లోనే ప్రకాశిస్తున్నాము. ఇది మనం గ్రహించాలంటే, అనుభవానికి తెచ్చుకోవాలంటే సద్గురువులని, మహాత్ములను ఆశ్రయించాలి. వారి యొక్క మార్గదర్శకత్వంలో మనలోనే వున్న ఆ దివ్య చైతన్యాన్ని గుర్తించ గలుగుతాము. కానీ, గురుదేవుల యందు అచంచల విశ్వాసం కలిగి

వుండి, వారు చెప్పినట్లు తు.చ. తప్పకుండా ఆచరించిన నాడే అది సాధ్య మవుతుంది.

'ఈ దేహమే నేను' అని అనుకుంటున్న మానవులు సుఖదుఃఖాలు, రాగద్వేషాలు మొదలైన ద్వంద్వాలకు గురియై, కర్మను అనుభవిస్తున్నారు. 'ఈ దేహమనే అద్దె కొంప నీవు కాదురా; నువ్వు శుద్ధ చైతన్య స్వరూపుడవు' అని మహాత్ములు మనలను మళ్ళీ మన స్వంత ఇంటికి తీసుకుని వస్తున్నారు. నీ అంతరేంద్రియాలకు గానీ, బాహ్యేంద్రియాలకు గానీ స్వయంసత్తా లేదని గ్రహించు. నీలో వున్న చైతన్యము నిన్ను ప్రకాశింపజేయటమే కాక, ఈ సమస్త సృష్టినీ ప్రకాశింప జేస్తోంది. ఇది తెలుసుకోవాలంటే నువ్వు సద్గురునాథుని ఆశ్రయించి, వారు చెప్పిన విధంగా సాధన చేయాలి. కదలకుండా వుంటే పిల్లవాడికి అక్షరాలు దిద్దటం వచ్చినట్లు, సద్గురుదేవుల దివ్యచరణ సన్నిధి యందు స్థిరమైన నిరంతర దృఢ భక్తి కలిగి వుండి సాధన చేయాలి. 'మనదైన స్థానం ధ్యానం. మన స్వంత ఇల్లు ధ్యానం'. అత్త ఇంటికంటే అమ్మ ఇంట్లో మనకి స్వతంత్రం వున్నట్లు గురుదేవుడి (భగవంతుడి) సన్నిధిలోనే మనకు స్వతంత్రం వుంటుంది. ఎందుకంటే, మన జీవితానికి, కడుపుకి, హృదయానికి కూడా పెట్టేవారు గురుదేవులు. మన జీవితానికి ఇహపర సౌఖ్యాలు రెండూ ప్రసాదిస్తారు.

మనలోనే వున్న ప్రణవాన్ని వినాలంటే ఎలా ఉపాసన చేయాలి? ప్రతి సాధకుడికి అత్యంత ప్రబల శత్రువు బద్ధకం. దానిని దగ్గరకు రానీయకుండా చూడాలి. నిజమైన దృష్టి కలిగిన సాధకుడికి నిద్ర రాదు. అతని మనస్సు ఇతర విషయాదులపై పోదు. ధ్యానమనుకునే స్థితే నీదని గుర్తించినప్పుడు ఆసనాలు, భూమ్యాకర్షణ శక్తి నిన్నేమీ చేయలేవు. నీకు ఉన్నటువంటి పూర్వపు వాసనల బలం చేత పొరపాట్లు చేస్తున్నావు. అదే  అలవాటు అయిపోయి గ్రహపాటుగా మారిపోతోంది. కనుక దృఢమైన పట్టుదలే వైరాగ్యం అని చెప్పారు శ్రీ బాబూజీ మహరాజ్.

ధ్యానమనేది మీ నుండి భిన్నం కాదు. ఇది అండర్‌లైన్ చేసుకోండి. దానిని పొందాలంటే అనుష్ఠానం, ఉపాసన కావాలి. అట్టి ఉపాసనా అనుష్ఠానాలకి కావలసిన అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి, గురుపాదుకలు సర్వదా కాపాడు గాక!

# అగస్త్య హృదయం

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

(గత సంచిక తరువాయి)

**ఏష బ్రహ్మాచ విష్ణుశ్చ శివస్కందః ప్రజాపతిః।**
**మహేంద్రో ధనదః కాలో యమస్సోమో హ్యపాంపతిః॥**
**పితరోవసవస్సాధ్యాః అశ్వినో మరుతో మనుః।**
**వాయుర్వహ్నిః ప్రజాప్రాణః ఋతుకర్తా ప్రభాకరః॥**

ఈయనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, స్కందుడు, ప్రజాపతి, ఇంద్రాది దేవతలు, దిక్పాలకులు, పితృదేవతలు, వసువులు, సాధ్యులు, అశ్వినీ దేవతలు మొదలగువారందరి ప్రతిరూపము. ఋతుకారకుడైన ఈ ప్రభాకరుడే సకల ప్రాణికోటికి ఆధారము.

ఈ రెండు శ్లోకములు ముందుగా వివరించుకున్న ఆదిత్యుని సర్వదేవాత్మకతను విపులీకరిస్తూ ఆయనే త్రిమూర్తులకు, సకల దేవతలకు ప్రతిరూపంగా వర్ణిస్తున్నాడు. సనాతన ధర్మములో ప్రతి దేవతనూ ప్రత్యక్షంగా కనిపించే సూర్యుని రూపంలో ఆరాధించాలని చెప్పబడింది. అలాగే ప్రతి దేవత యొక్క సహస్ర నామములలో ఆదిత్యుని నామము కనిపిస్తుంది. ఉదాహరణకు లలితా సహస్రనామ స్తోత్రంలో **ఉద్యద్భాను సహస్రాభా, భానుమండల మధ్యస్థా** అంటూ ఉదయిస్తున్న బాలభానునిలో, భానుమండల మధ్యలో ప్రకాశిస్తున్న అమ్మవారిని దర్శిస్తాము. అదే విధంగా విష్ణు సహస్రనామ స్తోత్రంలో కూడా **రవిర్విలోచన సూర్యః, సవితారవిలోచనః, స్వయంభూ శంభురాదిత్యః పుష్కరాక్షోమహాస్వనః** మొదలగు స్తోత్రములలో ఆదిత్యుని శ్రీ మహావిష్ణువు యొక్క ప్రకాశమైన స్వరూపముగానూ, ఆ విరాట్ పురుషుడి నేత్రముగానూ స్తుతిస్తాము.

శ్రీరుద్రము కూడా **నమోఽస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే** అంటూ రుద్రుని సహస్రాక్షుడై, సహస్ర కరములతో ఆదుకునే ఆదిత్యునిగా వర్ణిస్తుంది. అంతేకాక, సూర్యుని ఇంద్రాది దేవతలు, పంచభూతముల ప్రతినిధిగా, సకల జీవరాశికి ప్రాణదాతగా కీర్తించారు. ఈ శ్లోకములను అనంతము, అవ్యయము అయిన పరమాత్మ తత్త్వమును తన శిష్యునికి అగస్త్యులు చేస్తున్న బోధగా గమనించాలి. దీనికి సారూప్యమైన వివరణ మనకు నారాయణోపనిషత్తు వివరిస్తూ శ్రీమన్నారాయణుని నుండే

బ్రహ్మరుద్రులు, వసవస్సాధ్యులు, ద్వాదశాదిత్యులు ప్రకటితమవుతున్నారని తెలియజేస్తోంది. (**నారాయణాత్ బ్రహ్మ జాయతే.... నారాయణాత్ ఏవ సముత్పద్యన్తే, నారాయణే ప్రవర్తన్తే, నారాయణే ప్రలీయన్తే**).

శ్రీ బాబూజీ మహరాజ్ పలుమార్లు నారాయణోపనిషత్తుని పారాయణ చేయుస్తూ జగమంతా నారాయణ మయముగా దర్శించాలని వివరించేవారు. శ్రీబాబు **ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి** అన్న వాక్యమును విశదీకరిస్తూ వివిధ రూపములలో వ్యక్తమవుతున్నప్పటికీ అవ్యక్తమైన సత్యవస్తువు మాత్రము కేవలం ఒక్కటే అని శలవిచ్చేవారు. అక్షర రూపమైన పరమాత్మ గురించి ఇంత సరళంగా అందించటం సమర్థ సద్గురువులకే చెల్లు. ఈ అంశమునే జగద్గురువులైన గీతాచార్యులు భగవద్గీతలో ఉటంకిస్తూ **తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరం** అంటూ గురువు యెడల తత్పరులైన సాధకులకు ఆయన జ్ఞాన భాస్కరుడై అజ్ఞానమును తొలగించి, సత్యవస్తువును దర్శింపజేస్తారు అని వివరించారు. సాక్షాత్ పరబ్రహ్మ రూపమైన గురువును గుర్తించాలని ఈ శ్లోకముల యొక్క గూఢార్థము.

సర్వేసర్వత్రా పరమాత్మ వస్తువును దర్శిస్తూ వారు సర్వజ్ఞులై మనందరినీ ఆ మార్గములో నడిపించాలని కంకణం కట్టుకుని, మనం ప్రేమగా **సర్వజ్ఞాయ నమః** అని స్తుతించుకునే శ్రీ బాబునే విశ్వమయులు, మరియు విశ్వాత్మకులుగా గుర్తించడమే మన కర్తవ్యం.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి చెక్కా అంజమ్మగారు 30-7-2021 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీబాబు దివ్యవాణి

సేకరణ - పి. రాఘవేంద్రరావు

25-12-1985

బృందావనంలో ప్రతి ఇసుకరేణువు కృష్ణుని పాద స్పర్శచే పవిత్రమైనది. అచ్చట నెమళ్ళు పురివిప్పి నాట్యమాడేవి. యమునా నది కృష్ణుని పాదస్పర్శ సోకి నీలవర్ణమైనది. తక్కిన నదులు అట్లా కావు. నదిలోని కప్పలు స్వామిపాదాలను తాకితే తమ బురద ఆయనకు అంటుతుందేమోనని ఆయన చరణారవిందముల చుట్టూ తిరుగుచుండేవి. గోపికలు పరమాత్ముని కొరకు తపించేవారు. అట్టి పరమాత్మ అంతటా ప్రకాశిస్తూ వున్నాడు. ఆయన కాంతివలననే ఈ సర్వజగత్తు ప్రకాశిస్తున్నది. రామకృష్ణ పరమహంస, కబీర్ దాస్, మీరా, సక్కు, నామదేవుడు, గురునానక్, తుకారాం మొదలగు మహాత్ములు ఆయన దివ్యచరణారవిందముల యందే లయించిపోయినారు.

పరమాత్ముని కృపకు చిన్న పెద్ద తారతమ్యము లేదు. లోపమేమన్నా వుంటే అది మనలోనే వుండాలి. చూడండి సూర్యుని కాంతి అందరకీ సమానంగా ఉంటుంది. గంగానది ఉందనుకోండి అది కోటీశ్వరుడు స్నానంచేస్తే మురికిని పోగొట్టి, బీదవానికి మురికి వుంచదు. కోటీశ్వరునికి బిందెనిండా నీళ్ళిచ్చి బీదవానికి సగము వరకే యివ్వటం లేదుకదా!

భగవానుని స్మరించితే ఆయన నీకు ఏ టైముకి ఏదికావాలో అది అందజేస్తాడు. స్మరించమంటే ముక్కుమూసుకొని కూర్చోమని చెప్పలేదు. కర్మ ఆచరించు, ఫలితం నాకు వదులు. కర్మ చేస్తూ భగవానుని స్మరించు. టైము లేకపోతే ఆఫీసుకు వెళ్ళేటప్పుడు రోడ్డుమీద నడుస్తూ ధ్యానించు, అదీలేదు విశ్వాసము పెంపొందించుకో.

గాఢమైన విశ్వాసమే భక్తి. ఐదునెలల పసికందుకు తల్లి ఏ టైముకు ఏది అందజెయ్యాలో అది అందజేస్తుంది. అట్లే ఆ భగవానుడు నీకు అందజేస్తాడు. చెట్టు వుందనుకోండి దానికి పువ్వులు పూయి, కాయలు కాయి అని చెప్పనవసరం లేదు. దానిని సంరక్షిస్తే చాలు. అట్లాగే భగవంతుని ధ్యానిస్తే చాలు. భగవంతుడు అమృత తత్త్వానికి

ఎగబ్రాకమన్నాడుకాని నీచత్వానికి దిగజారమన్నాడా? కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములను వదలి నిశ్చల మనస్సుతో ఏ సంకల్పములు లేక మనస్సు భగవంతుని దివ్య చరణారవిందముల యందుంచండి. ఆ గోపికలు అట్లుంచి తరించారు.

మనస్సు భగవంతుని దివ్యచరణారవిందముల యందు లగ్నమైనప్పుడు జపతపములేల? నందనారుడు అట్లే తరించాడు. నందనారుడెవరు మాదిగవాడు. అయినా తరించలేదా? గోవిందు డెవరు? గొల్లవాడు. మనము నిత్యము ఆ గోవిందుని స్మరించుటలేదా? భగవంతునికి కుల మత భేదాలు లేవు. బ్రాహ్మణుడు అంటే బ్రహ్మజ్ఞాన సంపన్నుడని, శూద్రుడంటే అజ్ఞానుడని అర్థము. వేదములు స్త్రీలు శూద్రులు చదువగూడదని మన పండితులు శాస్త్రాలలో వ్రాశారు. కాని అట్లాకాదు. భగవంతుని దయకు అందరూ పాత్రులే. అరుంధతి ఎవరు? మాదిగ. కాని ఆమె మహాజ్ఞాని. వశిష్ఠుడంతటి జ్ఞానికే కులమత తారతమ్యము లేనప్పుడు మీకు ఎందుకు? సత్వ,రజో,తమో గుణములు వదలి నిశ్చల మనస్సుతో ధ్యానించి "అహం బ్రహ్మాస్మి" అంటే నేను బ్రహ్మను, అంటే ఈ శరీరము నేను అనే భ్రాంతిని వదలి 'నేను' ఎవరో తెలుసుకొన్న వాడే భగవంతుని కృపకు పాత్రుడు.

భగవంతుడు సాకార రూపుడు, నిరాకార రూపుడు అంటారు. రెండింటికి భేదములేదు. అది తెలియక మానవుడు అజ్ఞానములో పడి పోవుచున్నాడు. చూడండి సముద్రంలో నీరు యింకిపోయిందనుకోండి లవణం అవుతుంది. రెండిటి రుచులలో భేదము లేదు. ఉప్పునీరు అని లవణం అని అంటాము. రూపంలో తేడాయేగాని వేరే ఏమిలేదు. భగవంతుడు ద్వైతభావములో ఉండమని ఎప్పుడూ చెప్పలేదు. ప్రతి మానవుణ్ణి ప్రేమించమన్నాడు. ప్రతిమానవునిలో పరమాత్మని చూడమన్నాడు.

భగవంతుడు ధనం సంపాదించ వద్దనలేదు. తనకు ఎంతవరకు శక్తి నిచ్చాడో అంత సంపాదించమన్నాడు. ఇతరులకు సహాయం చేయమన్నాడు. ఆ ధనముతో దారాపుత్రాదులను పోషించి మిగిలిన ధనమును బీద విద్యార్థులకు మొదలగు వారికి సహాయం చేయమన్నాడు. లేకపోతే ఆ జీవికి సహాయపడమని భగవంతుని

ప్రార్థించమన్నాడు. అదీ చేతగాకపోతే అపకారం మాత్రము చేయవద్దు అన్నాడు. నువ్వుచేసే సహాయం కంటే భగవంతుడు ఎక్కువ సహాయమే చేస్తాడు.

చూడండి కుటుంబములో రాక్షసప్రవృత్తి కలవాడు ఒక్కడుంటే కుటుంబమంతా అశాంతి పొందుతుంది. సోమరితనం పెంచుకోవద్దు. సోమరితనం కలవాడు దుర్జనుడి కంటే హీనుడు. ఒకమానవుడిని ఇంకొక మానవుడు నమ్మడు చూడండి. ఇద్దరు భార్యభర్తలు వున్నారనుకోండి, భార్య భర్తను నమ్మదు, భర్త భార్యను నమ్మడు. వీరిని కోడలు నమ్మదు. వీరందరు కలసి కూతురు, అల్లుడిని నమ్మరు. నమ్మితే చాటుగ చెప్పుకోవలసిన పని ఏముంది?

'ప్రణవోపనిషత్తు' ఏమి చెప్పింది? ప్రణవం అంటే ఓంకారము లేనిదే ఏ నామము లేదు. ఓంకారము జపిస్తే మనలోని కర్మబీజములు హరిస్తాయి. మానవుడు సంకటములకు గురి అగుచున్నాడు. పరమాత్ముడు అట్టి వానినికూడ నన్ను స్మరిస్తే విముక్తుడిని చేసి రక్షిస్తానంటున్నాడు. శంకరభగవత్పాదులవారు అన్నట్లు విషయవాంఛల యందు మునిగి తేలు వాడు 'మనిషి' అంటే పశువు అని అర్థము. ఈ గుణములను జయించినవాడు 'మనీషి' - అన్నారు శ్రీబాబు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా సెప్టెంబర్, అక్టోబర్ 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***సెప్టెంబర్ 2021 :*** AS 7356, 7363, 8376, 8382 , 8383, 8284
LM 4274, 4275, 4276

***అక్టోబర్ 2021 :*** AS 2106, 5300, 6867, 7375, 7380, 7381, 7391, 8393, 8397, 8429, 8433, 8436, 8462, 8463, 8468.
LM 4277, 4282.

# నమ్మినవారికి నమ్మినంత

- ఎన్. కుట్టీ

బదరీనాథ్, కేదారనాథ్‌లు సంవత్సరంలో ఆరు నెలలు తెరిచి, మరొక ఆరు నెలలు మూసి వుంచుతారు. ఒక నారాయణ భక్తుడికి ఎప్పటి నుంచో బదరీనారాయణుని దర్శించుకోవాలని కోరిక వుండేది. కానీ, ఎంత ప్రయత్నించినా ఎప్పుడూ ఏదో ఒక ఆటంకం ఎదురయ్యేది. ధనము లేకపోవడమో, ఎవరూ తోడు లేకపోవడమో, లేదా ఆరోగ్య పరిస్థితి బాగుండకపోవటమో ఇలా అనేక కారణాలు. వయస్సు పెరిగిపోయింది. 75సం॥లు వచ్చాయి. అప్పుడు ఎవరో గుంపుగా కలిసి భక్తులు వెడుతున్నారు బదరీకి. తాను కూడా వాళ్ళను బ్రతిమాలి ఎలాగో ఒప్పించి, వారితో కలసి ప్రయాణమయ్యాడు.

అందరి సహాయసహకారాలతో బదరీ చేరాడు. అదే ఆఖరిరోజు. ఆ రోజు రాత్రే గుడి తలుపులు మూసివేస్తారు. ఇహ మళ్ళా ఆరు నెలల తరువాతనే ఆలయం తెరుస్తారు. తోటి భక్తులంతా బయలుదేరుతున్నారు. కానీ ఈ పెద్దాయనకు విపరీతమైన జ్వరం! కదలలేని స్థితిలో వున్నాడు. ఆ రోజు స్వామిని దర్శించుకోకపోతే, ఇహ వారందరూ దర్శనం లేకుండానే తిరిగి వాళ్ళ ఊరు వెళ్ళవలసి వస్తుంది. అందుకని వారంతా ఆయనను అక్కడే వదిలివేసి దర్శనానికి పైకి వెళ్ళారు. వారందరూ దర్శనం చేసుకోగానే అర్చకులు ఆలయం తలుపులు మూయబోతున్నారు. ఇంతలో కొంతమంది క్రిందకు వచ్చి తిరిగి ఈ పెద్దాయనను జాలితో పైకి మోసుకుని రావడానికి క్రిందకి వచ్చారు. సరిగ్గా అదే సమయానికి తలుపులు మూసివేస్తున్నారు. అక్కడే వున్న భక్తులు కొంతమంది ఆ ఆలయ అధికారులతో 'బాబూ! మేము చాలా దూరం నుండి వచ్చాము స్వామి దర్శనార్థం. మా అందరికీ దర్శనం అయింది. కానీ, ఈ ముసలాయనకి జ్వరం వచ్చింది. కొంచెం తగ్గాక మేము తీసుకుని వస్తాము. దయచేసి ఆయన కూడా దర్శనం చేసుకుని వచ్చేదాకా ఒక్క 5 నిమిషాలు తలుపులు తెరచి వుంచండి' అని ప్రార్థించారు. కానీ, వారు ససేమిరా ఒప్పుకోలేదు. మూసివేయడానికే సిద్ధ పడ్డారు.

అప్పుడు ఆ భక్తులు క్రిందకు వచ్చి ఆ ముసలాయనతో 'మేము ఎంత చెప్పినా అధికారులు మా మాట వినలేదు. ఆలయం

మూసివేస్తున్నారు. కనుక మనం అందరం కలిసి తిరిగి మన ఊరు వెళ్ళిపోదాం' అని చెప్పారు. అప్పుడా ముసలాయన ఆ భక్తులతో తనను ఎలాగైనా ఆ గుడి అధికారుల వద్దకు తీసుకువెళ్ళమని అర్థించాడు. జాలిపడి వారంతా ఆయనను అధికారుల దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ పెద్దాయన ఆ అధికారులతో 'నాయనలారా! నేను పెద్దవాడిని. శరీరంలో ఓపిక లేదు. ఈ భక్తులందరి సహాయ సహకారాలతో ఇక్కడకి రాగలిగాను. కానీ అదే రోజు జ్వరం రావడంతో వీరితో కలిసి గుడిలోకి రాలేకపోయాను. మీరు అనుమతిస్తే ఒక్క 5నిమిషాలలో దైవదర్శనం చేసుకుంటాను' అని ఎంత ప్రార్థించినా వారు వినకుండా తలుపులు మూసేశారు.

ఆ భక్తుడు విపరీతమైన దుఃఖానికి లోనయ్యాడు. తోటి ప్రయాణీకులతో 'ఇహ నేను మన ఊరికి రాను. ఇక్కడే నా ప్రాణాలు విడుస్తాను. మీరు మీ దారిన వెళ్ళిపోండి. ఈ జీవితంలో నాకు నారాయణుని దర్శనం చేసుకునే యోగం లేదు' అని బాధపడ్డాడు. చేసేది ఏమీ లేక వారంతా ఆయనను ఒంటరిగా వదలి వాళ్ళ ఊరుకు తిరుగు ప్రయాణం అయ్యారు.

ఆయన ఒక్కడే వున్నాడు. ఆయనకు ఇంకా ఆశ వున్నది నారాయణుడు తనకు తప్పక దర్శనం ఇస్తాడేమో అని. 'ఓ నారాయణా! కరుణాసాగరా! దయచూపించవా! నీ దర్శనమివ్వవా! లేకుంటే నా ప్రాణాలు నీ గుడి సన్నిధిలోనే వదిలివేస్తాను!' అని పరిపరివిధాల శోకించాడు. ఇంతలో బదరీనారాయణుడు గుడితలుపులు తెరచుకుని నిలువెత్తు ప్రత్యక్ష దర్శనమిచ్చాడు. ఆ భక్తుడు పరమ సంతోషంతో 'ప్రభూ! ఇది నా పూర్వజన్మ సుకృతం! నా గురించి శ్రమ తీసుకుని నువ్వే తలుపులు తెరచుకుని నా దగ్గరకు వచ్చావా ప్రభూ!' అంటూ సాష్టాంగ నమస్కారం చేశాడు. వెంటనే స్వామి నవ్వుతూ అంతర్ధానమయ్యాడు! ఆలయం తలుపులు మూసుకున్నాయి! ఆ భక్తుడు నమస్కరించి, కనులు తెరచి చూసేసరికి తన గ్రామంలో తన యింటిలో వున్నాడు.

ఆ ఊరికి చేరుకున్న మిగిలిన భక్తులంతా ఆ ముసలాయన అక్కడ వుండటం చూసి ఆశ్చర్యపోతూ ఎలా వచ్చావు? ఎవరు తీసుకు వచ్చారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దానికి ఆ భక్తుడు స్వామి

తనకు ప్రత్యక్ష దర్శనం ఇవ్వడం, తాను స్వామితో మాట్లాడటం, నమస్కరించడం, తిరిగి స్వామి తనను ఇక్కడకు చేర్చి అంతర్ధానమవ్వడం అంతా విపులంగా చెప్పాడు. ఇదంతా నేను కన్నుమూసి తెరిచేలోపు అయిపోయింది. అంటే ఒక్క క్షణంలో జరిగిపోయింది అన్నాడు. కానీ యదార్థానికి ఆ ముసలాయనను అక్కడే ఆరునెలలు వుంచి, గుడి తెరిచాక దర్శనం చేయించి, క్షేమంగా తిరిగి తన యింటికి చేర్చాడు కరుణాసాగరుడైన బదరీనారాయణుడు! ఇది అంతా ఆయనకు ఒక్క క్షణంలాగా అనిపించింది. అదే దైవ లీల!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి మహాదేవు రాజరాజేశ్వరి గారు (కె. సుగుణమ్మగారి పెద్ద అక్క) 24-7-2021 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 91 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**సెప్టెంబర్ 2021**-

1 బుధ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

10 శుక్ర - వినాయక చవితి - శ్రీ సద్గురు పాదపూజ.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

**అక్టోబర్ 2021**-

1 శుక్ర - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

7 గురు - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. భక్తసమారాధన

12 మంగళ - మూలా నక్షత్రం సరస్వతీ పూజ.

13 బుధ - దుర్గాష్టమి - కుంకుమ పూజ.

14 గురు - మహర్నవమి - కుంకుమ పూజ, భక్త సమారాధన.

15 శుక్ర - విజయదశమి - కుంకుమ పూజ.

20 బుధ - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

(గత సంచిక తరువాయి) **ఛాందోగ్యోపనిషత్ సారము** -సుషమ్నా ప్రసాద

వీటిలో కేవలకర్మ అనేది మనసుకు ఒక శిక్షణ ఇస్తుంది. కర్మాంగోపాసన సర్వవిధములైన పాపములను క్షాళన చేస్తుంది. దేవతోపాసన అభ్యుదయాన్ని చేకూరుస్తుంది. సగుణబ్రహ్మోపాసన క్రమ ముక్తిని ప్రసాదిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కర్మలన్నింటికి ప్రయోజనం చిత్తశుద్ధి. ఉపాసనలకు లక్ష్యం చిత్తైకాగ్రత. వాటికి ప్రత్యేకంగా ఎన్ని ఫలితాలు వున్నా బ్రహ్మజ్ఞానానికి దోహదం చేసే ప్రయోజనాలు మాత్రం ఈ రెండే. మొత్తం మీద కర్మానుష్ఠానం నుండి సగుణోపాసన దాకా సాధకుని దృష్టి విస్తృతమవుతూ పోవడమే ఇందులోని రహస్యం. దృష్టి విశాలం కావడమంటే సాధకునకు వ్యష్టి భావనపోయి సమష్టి భావన ఏర్పడటమే. సగుణం దగ్గరకు వచ్చేటప్పడికి అది శిఖరాగ్రం చేరుకుంటుంది. కానీ ఇందులో కూడా చిన్నలోపం వున్నది. బ్రహ్మతత్వాన్ని సాధకుడు అభేద దృష్టితో చూడాలి. అలా చూస్తేనే అది పరిపూర్ణమవుతుంది. ఆ పరిపూర్ణతను సాధించాలంటే సగుణాన్ని కూడా దాటి నిర్గుణ భావాన్ని చేరాలి. అప్పటికది ఉపాసన స్థితిని దాటిపోయి జ్ఞానమవుతుంది. ఆ జ్ఞానమే వాక్యార్థ జ్ఞానము.

కాబట్టి ఈ వాక్యార్థ జ్ఞానమనేది మన లక్ష్యార్థమైతే ఆ లక్ష్యార్థము, లేక గమ్యాన్ని చేరుకోవడానికి ఉపాసనలు సోపానాలు అవుతున్నాయి. అందుచేతనే కర్మోపాసనలు రెండింటినీ ఛాందోగ్యోపనిషత్తు మొదటి నుండి అయిదు అధ్యాయములలో వర్ణించి వాటికి లక్ష్యమైన ఆత్మజ్ఞానాన్ని చివరి మూడు అధ్యాయములలో వివరిస్తున్నది.

ఈ ఉపనిషత్తులో ఉద్దాలక మహర్షి తన కుమారుడు శ్వేతకేతువునకు చేసిన ఉపదేశమే తత్త్వమసి మహావాక్యము. తొమ్మిదిసార్లు తొమ్మిది సందేహాలు వెలిబుచ్చుతాడు శ్వేతకేతువు. తొమ్మిదవమారు కూడా 'తత్త్వమసి శ్వేతకేతో' అని ఉపదేశిస్తాడు తండ్రి. తత్త్వమసి అంటే అర్థం (తత్ - అది, త్వమ్ - నీవు, అసి - అయి వున్నావు.) అది నీవు అయి వున్నావు. నీ వంటి జీవుడు అది - అంటే బ్రహ్మము. ఈ జీవుడే బ్రహ్మమని ఉపదేశం. ఉపదేశమనేది ఎప్పుడూ జీవుడికే అన్వయిస్తుంది. అటు దేవుడికి కాదు, ఇటు జగత్తుకి కాదు. పరిపూర్ణుడు కాబట్టి దేవునకు ఉపదేశించనక్కర్లేదు. జగత్తు అచేతనం

కాబట్టి జగత్తుకూ చేసి ప్రయోజనం లేదు. కాబట్టి దేవుడిలాగా పరిపూర్ణుడు కాకుండా, జగత్తులా అచేతనం కాకుండా వుండే జీవుడే ఉపదేశాధికారి. అందుచేత శ్వేతకేతుని నిమిత్తంగా చేసుకుని, మనలాంటి జీవకోటికంతటికీ సందేశాన్ని అందజేస్తున్నది ఛాందోగ్యోపనిషత్తు.

తత్త్వమసి అంటే ఈ జీవుడే ఈశ్వరుడని అర్థం చేసుకున్నాము. అలా చెబుతున్నామంటే అంతకు ముందు జీవుడు ఈశ్వరుడు కాదనే భావనే వుంది. కాదనే భావన వుండబట్టే అవునని చెప్పవలసి వస్తున్నది. కానీ, వాస్తవంలో జీవుడు ఈశ్వరుడే సందేహం లేదు. కానీ ఆ సత్యం మరుగుపడ్డది. అంటే అతనా సత్యాన్ని మరచి పోయాడు. అందువలన జీవుడికి సంబంధించిన ఈ మరుపును పోగొట్టి మరల అతనికి బ్రహ్మభావాన్ని జ్ఞాపకం చేయడానికే శాస్త్రమవతరించింది. శాస్త్రమనేది లేనిదాన్ని తెచ్చిపెట్టదు. ఉన్నదాన్ని జ్ఞాపకం చేయడానికే శాస్త్రం అవతరించింది. దీనిని బట్టి **తత్త్వమసి** వాక్యము మనం జీవులము కాము, మనము ఈశ్వర స్వరూపులమే అనే సత్యాన్ని మనకు జ్ఞాపకం చేస్తున్నది.

అయితే ఈ జ్ఞాపకము వాక్యమెలా చేస్తుందనే ప్రశ్న వస్తుంది. వాక్యార్థ జ్ఞానానికి పదార్థ జ్ఞానం ఆవశ్యకం అన్నారు జ్ఞానులు. పదార్థమంటే **త్వం** అనే పదానికి అర్థం. ముందు ఈ **త్వం** దేనికన్వయిస్తుందో నిర్ధారణ చేసుకోవాలి. ఇది ఈ శరీరమా? లేక ఇంద్రియమా? లేక ప్రాణమా? మనస్సా? అహంకారమా? ఇందులో ఏదని ముందు నిర్ధారణ చేసుకోవాలి. అలా చేస్తేకానీ, **తత్** పదార్థమైన బ్రహ్మతో దానిని అన్వయించడానికి లేదు. నిర్ధారణ చేయడానికి సాధనలే అన్వయి, వ్యతిరేకాలు అనేవి. వ్యతిరేకమంటే ఎక్కడికక్కడే ఆగిపోవడం, ఆగకుండా సాగుతూ వస్తే అది అన్వయం. శరీరం దగ్గర నుండి అహంకారం దాకా వ్యతిరేకించేవే కానీ, అన్వయం చేసేవి కావు. జాగ్రత్తలో చూసే స్థూలదేహం స్వప్నావస్థలో లేదు. స్వప్నంలో చూసే సూక్ష్మదేహం సుషుప్తిలో లేదు. సుషుప్తిలోని కారణదేహం మరల జాగ్రదావస్థలో కనిపించదు. శరీరంతోపాటు ఇంద్రియాలు, ఇంద్రియాలతోపాటు మనస్సు కూడా లయమైపోతుంది గాఢ సుషుప్తిలో. ప్రాణం వున్నది కదా అంటే అది జడం. దానికి స్వయంగా అస్తిత్వం లేదు. అలాగే అహంకారము చైతన్యమనేది సాక్షిగా నిలచి చూస్తుంటేనే కర్త రూపమైన అహంకారం పనిచేస్తుంది.

-సశేషం

# శ్రీ లలితా పరాభట్టారిక

- పి. శివ శంకరి

జగజ్జనని శ్రీ లలితా సహస్ర నామాలలోని సృష్టి కర్త్రీ బ్రహ్మ రూపా, గోప్త్రీ గోవింద రూపిణీ, సంహారిణీ, రుద్రరూపా, తిరోధానకరీశ్వరీ, సదాశివానుగ్రహదా, పంచకృత్య పరాయణా అనే నామాలకు, మరియు నివేదన సమయంలో చదివే బ్రహ్మ రూపిణ్యై స్వాహా, గోవింద రూపిణ్యై స్వాహా, రుద్ర రూపిణ్యై స్వాహా, ఈశ్వర రూపిణ్యై స్వాహా, సదాశివ రూపిణ్యై స్వాహా అనే నామాలకు గల అనుబంధం తెలుసుకుందాం.

**సృష్టి కర్త్రీ బ్రహ్మ రూపా** - అంటే అమ్మ యొక్క శక్తియే సృష్టి చేస్తున్నప్పుడు బ్రహ్మ రూపిణిగా పిలువబడుతోంది. దీనిని అమ్మ పూజలో నివేదన చేసే సమయంలో చదివే **బ్రహ్మ రూపిణ్యై స్వాహా** అంటూ ఈ జగత్తులోని ప్రాణులన్నీ సృజించే బ్రహ్మరూపిణికి నివేదన పెడుతున్నాము.

**గోప్త్రీ గోవింద రూపిణీ** - అంటే స్థితి కారకురాలైన గోవింద రూపిణిగా మనలను పోషిస్తున్నది. దీనినే నివేదనలో గోవింద రూపిణ్యై స్వాహా అంటూ ఈ జగత్తులోని అన్ని ప్రాణులను పోషించే గోవిందరూపిణికి నివేదన చేస్తున్నాము. **సంహారిణీ రుద్ర రూపా** - అంటే లయకారకురాలైన రుద్ర రూపిణిగా మనలను అమ్మ తనలో లయం చేసుకుంటున్నది. దీనినే నివేదనలో **రుద్ర రూపిణ్యై స్వాహా** అంటూ జగత్తులోని సకల ప్రాణులను తనలో లయం చేసే రుద్రరూపిణికి నివేదన పెడుతున్నాము.

**తిరోధానకరీశ్వరీ** - తిరోధానము అంటే మరల తిరిగి జన్మకు వచ్చుట అని అర్థం. మనస్సు పక్వ స్థితికి రాకుండా అహంకార, మమకారములతో కూడిన మనసుకల జీవుడు జగత్తు అనే మాయలో పడి, ప్రాపంచిక బంధాలలో చిక్కుకున్న జీవులకు ఆయా జీవుల పాపపుణ్యాలను అనుసరించి, మనస్సు యొక్క సంకల్పాలను బట్టి పునర్జన్మలను ఇస్తున్నది అమ్మ. దీనినే నివేదనలో **ఈశ్వర రూపిణ్యై స్వాహా** అని నివేదిస్తున్నాము.

ఈ విధంగా తిరోధానమిచ్చి, కనీసం తరువాత జన్మలోనైనా బుద్ధిగా వుండి, గురువు యొక్క అనుగ్రహానికి పాత్రులమవటానికి, మరల ఇంకొక ఉత్తమ జన్మనిచ్చి, సాధనకు అనుకూలమైన పరిస్థితులను కల్పించి, ఉద్ధరిస్తున్నది.

అది ఎలాగు అంటే, ఈ జన్మలో కొద్దిగా సంస్కరించబడిన

మనస్సు ఆ మంచి ఆధ్యాత్మ వాసనలను మూటకట్టుకుని తరువాత జన్మలో ఆ జీవి యొక్క ఉద్ధరణ కోసం ఉత్తమ ఆధ్యాత్మిక సంస్కారంగల కుటుంబంలో జన్మించేటట్లుగా చేసి, మరు జన్మనిచ్చి మనో, బుద్ధి, చిత్త, అహంకారాలలో మార్పును కలిగించి ఆ యా జీవులను ఉద్ధరిస్తుంది.

**సదాశివానుగ్రహదా** - అంటే సదాశివ రూపంలో అనుగ్రహించేది అని అర్థం. అనుగ్రహము అంటే పునరావృత్తి లేని స్థితిని అంటే జనన మరణ ప్రవాహంలో పడకుండా మోక్షాన్నిచ్చే తల్లి. ఎవరైతే ద్వైత భావన లేకుండా, అందరిలోనూ గురు స్వరూపాన్ని దర్శిస్తూ, ద్వేష భావన లేని వ్యక్తి మాత్రమే అమ్మ యొక్క అనుగ్రహానికి పాత్రుడు. అటువంటి జీవికి మాత్రమే అమ్మ మోక్ష స్థితిని ప్రసాదించి, తన సాయుజ్యాన్ని ఇస్తుంది. దీనినే నివేదనలో **సదాశివ రూపిణ్యై స్వాహా** - అనుగ్రహమునిచ్చే ఆ సదాశివ స్వరూపిణికి నివేదన చేస్తున్నాము.

**పంచకృత్య పరాయణా** - అనగా సృష్టి, స్థితి, లయ, తిరోధానము, అనుగ్రహము ఈ అయిదింటిని పంచ కృత్యములు అంటారు. అంటే ఈ అయిదిటిని చేస్తున్నదా తల్లి అని అర్థము. ఇదే మనం అమ్మవారి పూజలో నివేదనలో చదివే **సద్గురు రూపిణ్యై స్వాహా!** దీనికి **పంచ కృత్య పరాయణ** అనే మంత్రానికి వున్న అనుబంధం తెలుసుకుందాం.

ఈ పంచ కృత్యాలను చేస్తున్న ఆ అయిదుగురు తల్లులలోనూ, సర్వాధిష్ఠాన చైతన్య స్వరూపమై, చరాచరాత్మకమైన జగత్తును నడిపిస్తున్న సద్గురు స్వరూపమైన అమ్మకి, అనగా సాకార, నిరాకార బ్రహ్మ స్వరూపమై, సగుణంగా, నిర్గుణంగా ప్రకాశిస్తున్న అమ్మకి మనం పూజలో నివేదనలో చదివే సద్గురు రూపిణ్యై స్వాహా అని మన మనో నేత్రంతో దర్శిస్తూ నైవేద్యం పెడితే, ఆ పదార్థం అమృతమై మనం పెట్టిన పదార్థాలకు జ్ఞాన వైరాగ్యాలనే రుచులతో తిరిగి మనకే ఆ అమృతాన్ని ప్రసాద రూపంలో అందిస్తోంది. అయితే స్థూల రూపంలో మనం పెట్టిన నైవేద్యాన్ని సూక్ష్మ రూపంలో స్వీకరించి తిరిగి మనకే ఆ ప్రసాదాన్ని స్థూల రూపంలో ఈ స్థూల శరీరానికి అందించి సూక్ష్మ రూపమైన మనసుని సాధనా మార్గం వైపుకు మరల్చుతోంది.

**తరువాయి భాగం 29వ పేజీలో ......................................**


అసలు వస్తువు
మధుప
అయ్యో నాన్నగారూ! అప్పుడే వెళ్ళిపోయారా!
1


ఏం నాయనా! ఎందుకు ఏడుస్తున్నావు?
2


మా నాన్నగారు
పోయారండి
3


అవునా! మరి
ఇక్కడ పడుకుని
ఉన్నది ఎవరు?
4


ఆయన మా నాన్నగారండీ!
మరి మీ నాన్నగారిని ఇక్కడే పెట్టుకుని పోయారని ఎందుకు ఏడుస్తున్నావు?
5


ఇక్కడున్నది మా నాన్నగారే కానీ ఆయన పోయారండి!
మా నాన్నగారు మాతో ఎంతో ప్రేమగా ఉండేవారండి!
6


అయితే మరి ఇక్కడ ఉన్నది ఎవరు? ఇన్నాళ్లూ ఈయననే మీ నాన్నగారనుకొని ప్రేమించావు కదా?
7


అంటే ఈ శరీరంలో ఉండి ఇన్నాళ్ళూ దానిని నడిపిస్తూ ఉన్న అసలు వస్తువైన ఆత్మయే మీ నాన్నగారు అన్నమాట!
ఆ ఆత్మ ఎప్పుడూ శాశ్వతమే! ఈ శరీరం ఎప్పటికైనా పడిపోయేదే! ఆ అసలు వస్తువుని గుర్తిస్తే ఇక దుఃఖం ఉండదు.
8

# బాబూజీ తో అనుభవాలు

(గత సంచిక తరువాయి) -వి. లక్ష్మీ నరసమాంబ

## బాబుగారి మరికొన్ని లీలా విశేషాలు

2018 ఆగస్ట్ నెలలో - ఒక మూడు రోజులు హైదరాబాద్ ఆశ్రమంలో వుండాలని వెళ్ళాను. ఖచ్చితంగా మూడు రోజులు ఇంటికి రాకుండా అక్కడే వుండాలని వెళ్ళాను. అయితే అక్కడ వుండవలసిన మూడు కుటుంబాల వాళ్ళల్లో ఒక్క కుటుంబం మాత్రమే వున్నది. మిగతా వారు అనివార్య కారణాల వలన ఇళ్ళ వద్దనే వుండిపోయారు. ఆ కుటుంబంలోనూ ఒక్క అమ్మాయే వంటావార్పుకి వున్నారు. అయితే రోజూ ఆశ్రమంలో భోజనం చేసేవారి సంఖ్య పదిమంది దాకా వుంటుంది. వారందరికీ ఆమె వండి వడ్డించాలి. తక్కిన వారందరూ ఆమెకు సహాయం చేస్తామంటున్నారు, చేస్తున్నారు కూడాను. కానీ, నిలబడి వంట చెయ్యవలసినది ఆమెయే కదా! ఇలాంటి పరిస్థితులలో - నేను ఆమెకు అదనపు భారమే కదా!

ఇలా జరుగుతూ వుంటే, రెండవ రోజునే ఆమెకు ఆరోగ్యం బాగాలేదు అని తెలిసింది. ఆరోజు శనివారం. నేనే అందరికీ ఉదయం పూట టీలు తయారుచేసి ఇచ్చాను. తరువాత ఆమె క్రిందకు వచ్చి అందరికీ ఉదయం ఫలహారాలు, భోజనం తయారుచేసి పెట్టింది.

ఆ మరునాడు ఆదివారం ఉదయం ప్రార్థన అనంతరం, వంటింటి తాళం నా చేతిలో పెట్టి, ఏమీ చెప్పకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె ఆరోగ్యం మరింత బాగాలేదు అని తెలుస్తూనే వుంది. నేను క్రిందకు వచ్చి అందరికీ టీ పెట్టి ఇచ్చాను. ఆ తరువాత ఏం చెయ్యాలో తెలియలేదు. టిఫెన్ చెయ్యాలా? చేస్తే ఏం చెయ్యాలి? ఎంత చెయ్యాలి? చెప్పేవారు ఎవరూ లేరు. ఆశ్రమ ఇన్‌ఛార్జ్ మనోహర్‌గారు, ఆ రోజు ఉదయం బయటకు వెడతాను అని చెప్పారు.

అందరూ మగవారు. వారు బయటకు వెడతారు, తింటారు. కానీ, బాబూజీ సంగతి, నా సంగతి ఏమిటి? ఏమీ పాలుపోలేదు. అలాగే ఒక గంట వేచి చూశాను. ఇక ఆ పరిస్థితులలో ఆశ్రమవాసులకు నా వలన కష్టం కలుగకూడదని నిశ్చయించుకుని ఇంటికి వెళ్ళిపోదామని, నిర్ణయించుకున్నాను. క్రిందకు వచ్చి వాచ్‌మెన్‌ను పిలిచి రెండు ప్లేట్లు

ఇడ్లీ తెమ్మన్నాను. అవి అతను తెచ్చి ఇచ్చే సమయానికి మనోహర్‌గారు కనబడ్డారు. నేను ఆయనకు విషయం అంతా చెప్పి, ఇక ఇంటికి వెళ్ళి రాత్రికి వస్తాను అని చెప్పాను. ఆయన నొచ్చుకుంటూ... 'అదేమిటి? మీరు దీక్షమీద వచ్చారు. 3రోజులు వుండాలి అని. అది నెరవేర్చుకుని వెళ్ళండి. ఎవరు వున్నా, లేకున్నా ఆశ్రమం నడుస్తుంది. పదండి. నేను ఉప్మా తయారు చేస్తాను. బాబూజీకి నివేదన చెయ్యాలి కదా!' అన్నారు.

నేను నా చేతిలోని ఇడ్లీ పార్సిల్ చూపిస్తూ 'ఇదిగో బయట నుండి టిఫెన్ తెప్పించాను' అన్నాను. ఆయన వెంటనే దానిని విప్పి, బాబుగారికి నివేదన చేసి, 'ఇక తినండి' అన్నారు.

ఈలోగా ఆశ్రమ సేవలో వున్న ఆ అమ్మాయి మునుపటి ఉత్సాహంతో క్రిందికి దిగివచ్చి 'అమ్మా! వుండండి. టిఫిన్ తయారు చేస్తాను' అని అట్లపిండి కలిపి అందరికీ అట్లు వేసి ఇచ్చింది. అటుపైన కార్యక్రమం అంతా ఎప్పటిలాగానే కొనసాగింది. రాత్రి ఫలహారం చేసి, నిద్రచేసి, ఉదయం ప్రార్థనా కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని నేను ఇల్లు చేరాను. బాబూజీ మహిమ అంటే అలా వుంటుంది!

- సశేషం

**భక్తమహాశయులకు విజ్ఞప్తి**

సమర్ధ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ వారు భక్తులందరికీ ప్రసాదించిన మహా ప్రసాదం "శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవములు". ఈ సంవత్సరం ది.07.10.2021 నుండి ది.16.10.2021 వరకు శ్రీకాళీవనాశ్రమంలో జరుగనున్నవి. వార్షికంగా పాల్గొంటున్న భక్తులు on line లో వారి పూజలు ముందుగా నమోదు చేసుకొనే ఏర్పాటు ఈ సంవత్సరం నుండి చేశాము. పూజ రుసుము చెల్లించటానికి ఈ QR కోడ్ స్కాన్ చేసి phone pay/Google pay/ paytm ద్వారా పంపవచ్చును. తరువాత మీ గోత్రము, పేరు, పూజ చేసుకొనే తేదీ, 8333067877 నంబరుకి మెసేజ్ పెట్టాలి. బ్యాంక్ ద్వారా పంప దలిచేవారు ఈ ఫోన్ నంబరుకి ఫోన్ చేసి అకౌంట్ నంబరు తెలుసుకొనగలరు.

Or SCAN QR CODE

TO PAY

Sri Sri Sri Hanupath Kali Vara Prasad Babu Trust

# సాధన

- భోగరాజు భారతి దేవి

కంచి కామకోటి పీఠాధిపతి పరమాచార్య జయేంద్ర సరస్వతీ స్వామివారు ఒకసారి ఒక జడ్జిగారింటికి వెళ్ళినప్పుడు ఆయన అన్న కొడుకు 11 సంవత్సరాల కుఱ్ఱవాడిని చూశారు. అతను ఉపనిషత్తులు, వేదాలు అన్నీ చదువుతున్నాడట. తరువాత అతను పెద్దవాడై మద్రాసులో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ 50 సంవత్సరాల వయస్సులో స్వామిని దర్శించుకోవాలని ఎంతో కోరికతో వెడితే ఆరోజు దర్శనాలు లేవని ముందురోజు దర్శనాలు ఇచ్చి అలసిపోయారని, వెళ్ళిపొమ్మని చెప్పారట. ఆయన చాలా బాధపడుతూ, ఉపనిషత్తులు చదువుతూ ఆదుర్దాతో కళ్ళ వెంబడి నీరు కారుస్తూ కూర్చున్నాడట. కొద్దిసేపటిలో స్వామి శ్రీగురుదేవుల లాగానే అక్కడున్న వారందరినీ లోనికి పంపించమన్నారట. ఇటువంటి అనుభవాలు శ్రీబాబూజీతోనూ, శ్రీమాతాజీతోనూ మనలో చాలామందికి ఉన్నాయి కదా.

స్వామివారు ఆ భక్తుడిని గుర్తించి, వివరాలు అన్నీ అడిగి, 11సంవత్సరాల వయస్సులో చూసిన సంగతి కూడా చెప్పారట. పైగా వారి పినతండ్రి బ్రిటీష్‌వారి కాలంలో ఒక జడ్జిగారి వద్ద గుమాస్తాగా వుంటూ, కఠోర పరిశ్రమ చేస్తూ తీర్పుల విషయంలో జడ్జిగారికి సలహాలు ఇచ్చే అంతటి స్థాయికి వచ్చారట. ఒక బ్రిటీష్ కలెక్టర్ అతన్ని చూసి మెచ్చుకొని అప్పటికప్పుడు మెజిస్ట్రేట్‌గా నియమించాడని స్వామివారే చెప్పి, విధి నిర్వహణ కూడా అంత గుర్తింపబడుతుందని చెప్పారట.

స్వామివారి దగ్గర శెలవు తీసుకుని ఆ భక్తుడు బ్రహ్మానందంతో ఇంటికి తిరిగి వెళ్ళి సాధన ఎంతో నిష్ఠగా చేస్తూ కొంతకాలానికి స్వామిని దర్శించడానికి బయలుదేరుతూ 'స్వామినాకు తప్పక దర్శనం ఇస్తారు. నేను ఇంత సాధన చేస్తున్నాను కదా' అనే అహం భావనతో వెళ్ళాడట. స్వామి దర్శనమిచ్చి అతని భార్యతో మాట్లాడారట కానీ ఇతనివైపు చూడకుండా తల ప్రక్కకు త్రిప్పుకున్నారట. అహం అంత పని చేసిందని తన తప్పును తెలుసుకుని సాధన ప్రారంభించి జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు.

# హనుమంతుడు

(గత సంచిక తరువాయి)

-పాలూరి కాళీప్రసాద్

అయినా ఇదంతా ఆ రాముని మహిమ అనే ఆయన చెప్పుకుంటాడు కానీ, 'నేను చేస్తున్నాను' అనే కర్తృత్వ భావన కానీ, 'దీని ప్రతిఫలం నాకే దక్కాలి' అనే భోక్తృత్వ భావన కానీ ఆయనకు లేవు. పైగా తాను చేసే మహత్తర కార్యాలతో తనకు ఎటువంటి సంగమూ లేకపోయినా, ఆయా కార్యాల సిద్ధి విషయంలో ఎటువంటి వికారమూ (కార్యం సిద్ధిస్తే ఆనందం, విఫలమైతే విషాదం) లేకపోయినా 'ఇది నాకెందుకులే' అనే నిరాసక్తత ఏమాత్రం లేకుండా మొక్కవోని దృఢ సంకల్పంతో, తిరుగులేని ఉత్సాహంతో ఆయా కార్యాలను నిర్వహిస్తాడు. అందుకే **ముక్తసంగోనహం వాదీ ధృత్యుత్సాహ సమన్వితః సిద్ధ్యసిద్ధ్యో నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే** అని గీతాచార్యుడు నిర్వచించిన శుద్ధ సాత్త్విక కర్త హనుమంతుడు.

సూపర్ మాన్, స్పైడర్ మాన్, బ్యాట్ మాన్, ఐరన్ మాన్ ఇలాంటి కల్పిత పాత్రలు ఎన్ని వచ్చినా తరతరాలుగా ఆబాలగోపాలాన్ని అలరిస్తున్న సూపర్ హీరో హనుమాన్. ఇతర దేవతలలో ఎవరైనా కొంతమందికి నచ్చకపోవచ్చునేమో గానీ, హనుమంతుడు నచ్చనివాడు ఎవడూ వుండడు. అయితే హనుమంతునికి మాత్రము ఆ భేద భావాలు వుండవు. నువ్వు ఏ దేవతను అర్చించినా, హనుమంతుని అనుగ్రహం నీకు చాలా సులభంగా కలుగుతుంది. 'మా దేవుడు గొప్ప అంటే కాదు మా దేవుడు గొప్ప' అని కొట్లాడుకోవడాన్ని ఆయన ఎన్నడూ హర్షించడు. అందుకే తులసీదాస్‌వారు భక్త్యావేశంలో 'ఔర దేవతా చిత్త న ధరయీ హనుమత్ సేయీ సర్వ సుఖ కరయీ' అని వ్రాస్తే, దానిని తెనిగించిన ఎమ్.ఎస్ రామారావుగారు ఇతర దేవతలను కించపరచవలసిన అవసరం ఏమున్నదని 'ఇతర చింతనలు మనసున మోతలు, స్థిరముగ మారుతి సేవలు సుఖములు' అని మార్చి వ్రాశారు.

వీరాంజనేయుడు, భక్తాంజనేయుడు, దాసాంజనేయుడు, అభయాంజనేయుడు ఇలా రకరకాల రూపాలలో ఆంజనేయుడు మనకు దర్శనం ఇస్తాడు. మరే దేవుడిలో ఇన్ని కోణాలు మనకు

కనిపించవు. దేవతలలో, భక్తులలో, దాసులలో, వీరులలో, మహిమాన్వితులలో, పండితులలో ఇలా ఎందులో చూసినా ఆయనే అగ్రగణ్యుడు. అంతేకాదు, సగుణ నిర్గుణ భక్తులు రెండింటిలోనూ ఆయనకు ఆయనే సాటి. హనుమంతుడు ఒక్కసారి 'రామ్' అంటే ఆయన శరీరంలోని ముప్పది మూడు కోట్ల రోమాలు నిక్కబొడుచుకుని 'రామ్' అని ప్రతిధ్వనిస్తాయి అని శ్రీగురుదేవులు చెప్పేవారు. అలా తన తనువులోని అణువణువునా నిర్గుణ రూపంలో రామచంద్రుడు నిండి వున్నా, ఎప్పుడెప్పుడు ఆ స్వామిని సగుణంగా కన్నులారా దర్శించుకుంటానా, చేతులారా సేవ చేసుకుంటానా అని నిరంతరం అశ్రుపూరిత నయనాలతో ఎదురు చూస్తూ వుంటాడు ఆయన.

అటువంటి హనుమంతుని మన హృదయంలో నిలుపుకుంటే, ఆయనతోపాటు ఆయన హృదయంలో సదా నివసించే శ్రీరాముడు, ఆ రాముని హృదయ నివాసి అయిన పరమేశ్వరుడు, ఆ పరమేశ్వరుని హృదయ నివాసి అయిన గురుదేవులు ఇలా సకల దేవతలు మన హృదయంలోనే స్థిర నివాసం ఏర్పరచుకుంటారు. మనకీ మానవ జన్మ వచ్చినందుకు అంతకంటే సార్థకత ఏముంటుంది?

**శ్రీ లలితా పరాభట్టారిక 20వ పేజీ తరువాయి భాగం ..................**

కాబట్టి ప్రసాదాన్ని గౌరవ భావనతో చూడాలి. కాని రుచి బాగుంది, బాగోలేదు అంటూ  లోపాలు విమర్శించరాదు. అది కూడా కర్మకి సంబంధించి, వాక్ రూపమైన కర్మగా మారి దాని వల్ల కర్మఫలం అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడి కష్టాలు కొని తెచ్చుకున్నట్లవుతుంది. ఈ కష్టాన్ని అనుభవించడం కోసం ఇంకో జన్మ ఎత్తవలసిన అవసరం కూడా రావచ్చు. కాబట్టి ప్రతి విషయం లోనూ ఎదుటి వారిని విమర్శించడం మాని జాగ్రత్తగా వుండటానికి ప్రయత్నిస్తూ వుంటే మనలో క్రమ క్రమంగా మార్పు వచ్చి మన గురుదేవుల కృపకు పాత్రులమవుతాము.

అందుకే దుర్గా సప్తశ్లోకి లోని **శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే, సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోస్తుతే** - అనే శ్లోకం ఆధారంగా శరణుకోరిన భక్తుల యొక్క కష్టాలను తొలగిస్తూ, ఆ జగజ్జనని మనలను గురుదేవుల రూపంలో నారాయణి అంశతో అనుక్షణం కాపాడుతోంది.

# ఎవరు అస్పృశ్యుడు?

(గత సంచిక తరువాయి)

-సుషమ్నా ప్రసాద

తామంతటివారైనప్పుడు బ్రాహ్మణుడైనా సరే, చండాలుడైనా సరే అట్టి బ్రహ్మవేత్త నాకు గురువే అన్నారు. నిజమైన జ్ఞాన స్థితిలో చండాలుడు చండాలుడు కాదు, బ్రాహ్మణుడు బ్రాహ్మణుడుకాదు అని వేదము ఉద్ఘాటిస్తోంది. ఈ సత్యమును మనకు తేటతెల్లం చేయడానికే శ్రీ శంకర భగవత్పాదులు మాయా చండాలునకు మనీషా పంచకమును అయిదు శ్లోక సంపుటితో వివరించారు. అందుచేతనే మనీషా పంచకమనే పంచశ్లోక సంపుటిలో **చండాలోస్తు సతుద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ** అని మకుటంగా వస్తుంది.

ఇంతకీ ఈ చండాలుడెవరు? సాక్షాత్ కాశీనాధుడైన విశ్వేశ్వరుడే. శంకరులను పరిశోధించడానికే ఆ రూపంలో వచ్చాడు. ఈ శంకరుడు జ్ఞాన ప్రచారం చేస్తున్నాడు. తాను చెబుతున్న విషయంలో అనుభవం వుండి చెబుతున్నారా, లేక కేవలం వాచా వేదాంతమా తెలియజేసి శంకరుల మహిమను వెల్లడించి లోకానికి శ్రేయస్సు కూర్చాలనే తలంపుతో అలా ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు సమాధానమును శంకరాచార్యులు మనీషా పంచకములో వివరించారు.

**జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే**
**యా బ్రహ్మాది పిపీలికాంత తనుషుప్రోతా జగత్సాక్షిణే**
**సైవాహం నచ దృశ్యవస్త్వితి దృఢ ప్రజ్ఞాపి యస్యాస్తిచేత్**
**చండాలోస్తు సతుద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ**

జాగ్రత్సప్నసుషుప్తులనే మూడు అవస్థలలో ఏ చైతన్యము మిక్కిలి స్ఫుటంగా ప్రకాశిస్తున్నదో, ఏది చీమ మొదలు బ్రహ్మ వరకు గల సర్వ శరీరములలో సాక్షిగా నెలకొని వున్నదో, ఆ చైతన్యమే నేనుగాని, దృశ్యమానమైన ఈ జడ వస్తువును నేను కాదు అనే జ్ఞానము ఎవని యందు సుదృఢమై ప్రకాశిస్తున్నదో అట్టివాడు చండాలుడైనా, ద్విజుడైనా సరే నాకు గురువు.

జాగ్రత్స్వప్న సుషుప్తి అనే మూడు అవస్థలను అనుభవించేవాడు ఒక్కడే. ఆ బ్రహ్మము అవస్థాతీతుడు. ఆ మూడు అవస్థలకు అతీతుడు, విలక్షణమైనవాడు చండాలుడైనా సరే, ద్విజుడైనా సరే అతనిని నేను

గురువుగా పరిగణిస్తాను. చండాలుని రూపంగా తొలగుము తొలగుము అన్నవాడే అతని జ్ఞానవైభవమును గుర్తించి, ఆ చండాలునికి ప్రణమిల్లాడు. అట్టివాడు నా గురువని అంగీకరించాడు. లోకంలో అన్ని ఉపాధులను ప్రకాశింప జేస్తూ, తాను స్వయంగా ప్రకాశించే బ్రహ్మమొక్కటే. అట్టివారు చండాలుడైనా, ద్విజుడైనా సరే నాకు గురువు అని మనీషా పంచకము నందు పంచశ్లోక సంపుటిలో నిస్సందేహంగా శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు నొక్కి వక్కాణించారు. కనుక **'అస్పృశ్యత'** అనేది కేవలం భౌతిక దృష్టితో వున్న మానవ నిర్మితమే. సర్వత్రా ప్రకాశించే బ్రహ్మమొక్కటే అని నిశ్చయంగా తెలుసుకున్న వాడికి **అస్పృశ్యత**, అంటరానితనమనేవి నిఘంటువులోనే వుండవు. అంటరానితనమును కేవలం మానసిక రుగ్మతగా గ్రహిస్తారు. కనుక బ్రహ్మజ్ఞానికి అంటరానితన మనేది హాస్యాస్పదంగా వుంటుంది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2021-**

1 బుధ - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

10 శుక్ర - వినాయక చవితి - ఉ. 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**అక్టోబర్ 2021-**

1 శుక్ర - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

13 బుధ - దుర్గాష్టమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

14 గురు - మహర్నవమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

15 శుక్ర - విజయదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

20 బుధ - ఆశ్వీయుజ పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

30 శని - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

జనకుడు శుకమహర్షికి నమస్కరించి వీటన్నిటి వల్ల ఏమిటి తెలుసుకొనేది అని ప్రశ్నిస్తే, శుకబ్రహ్మ ఇంక తెలుసుకునేది ఏదీ లేదన్నారు. అంటే ఆయన నిరీక్షణలోనే అసలు తత్వం గ్రహించారు. ఈరోజుల్లో అంత నిరీక్షణ చేయగలరా? ఆశ్రమానికి వస్తారు. గురువుగారు త్వరగా దర్శనం ఇస్తే రిటన్ టికెట్ కొనుక్కున్నాం వెళ్లిపోవాలి అంటూ చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని వస్తారు.

అయితే శ్రీ గురుదేవుల అవతార సమయంలో భక్తులు ఏదైనా కార్యక్రమాలలో పాల్గొనడానికి కానీ, మరి ఏ ఇతర కారణం చేతనైనా ఆశ్రమానికి వచ్చి తిరిగి వెళ్లడానికి శెలవుకోసం ఎదురు చూస్తూ వుంటే గురుదేవులు దర్శనం ఇచ్చేవారు కాదు. వారు శెలవు ఇచ్చేదాకా ఆ భక్తులు కదిలేవారు కాదు. అలా కొన్ని నెలలు ఉద్యోగస్తులు కూడా వుండిపోయేవారు. వ్యాపారస్థులుకానీ, ఇంకా మిగతా రంగాలలోవారు కానీ ఆ విధంగానే నిరీక్షించేవారు.

మహాత్ముల చర్యలు ఎలా వుంటాయి అంటే ఒక భక్తుడు బొంబాయి నుంచి వచ్చాడు. చాలా నెలలు వుంచేశారు ఆశ్రమంలో. ఆయన బొంబాయి తిరిగి వెళ్లిన తరువాత ఉద్యోగం ఊడిపోయిందేమో అనుకుంటే, వారికి అక్కడ ఆఫీసులో వారు రానన్ని రోజులూ ఆఫీసుకు వచ్చినట్లుగానే రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి వున్నాయి. మనం వుండటం వలన గురువులకు లాభం ఏమిటి? వారు చూసేది శిష్యుడిని ఎలా సాధన చేయించాలా అని.

శిష్యులు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితిని పొందాలి అని అనుకున్నప్పుడు మహాత్ములు ఎప్పుడు ప్రబోధిస్తారా అని చకోరపక్షిలాగా ఎదురు చూడాలి. వారి దర్శనం ఎప్పుడు దొరుకుతుందా, వారి తేజోకిరణాలు మన మీద ఎప్పుడు ప్రసరిస్తాయా అని ఎదురు చూడాలి. అలా చూస్తే తప్పక మన మీద ప్రసరిస్తాయి.

అలా శుక మహర్షి వ్యాసమహర్షి ద్వారా జ్ఞానాన్ని పొందినప్పటికి జ్ఞానానికి అంతం లేదని తెలుసుకుని, అంతటా, ఏ స్థితిలో వున్నా, వున్నది తానే అని గ్రహించాడు. అంతటా తానే వున్నప్పుడు లేనిదంటూ ఏదీ

లేదు. సమస్త అనుభవాలనూ ప్రకాశింపజేసే పరబ్రహ్మను నేను అని పూర్వమంత్రంలో చెప్పారు. అదే ధ్యానం. ఈ ధ్యాన స్థితిని చేరాలంటే దేహ మనో బుద్ధుల నుండి మనలను మనం మరలించుకోవాలి. ఈ ధ్యాన ప్రక్రియ ద్వారా మనస్సులోని తుఫాను చల్లారగానే ఆలోచనల ఆఖరి చిరుతరంగం కూడా అంతరించిపోగానే అప్పుడు ప్రసన్నమైన సత్య జలములో ప్రకాశిస్తున్నటువంటి నీ ఆరాధ్య దైవము ఎటువంటి అనుభవాన్ని అనుభవింపజేస్తుందంటే 'నేను కేవలం చిన్మాత్రుడను, సదాశివుడను అంటే ఎల్లప్పుడూ మంగళ స్వరూపుడను నేను. ఆ మంగళ స్వరూపం ఇవాళ్టికే మంగళం, రేపు వుండదని కాదు. సదా ఎల్లప్పుడూ ప్రకాశిస్తుంది' అని నొక్కి చెప్పారు శ్రీమాతాజీ.

శ్రీ మాతాజీవారు 19వ మంత్రాన్ని ఈ విధంగా వివరించారు. నా యందే సర్వమూ జనించి, నా యందే ప్రతిష్ఠితమై, నా యందే సర్వమూ లయం పొంది వున్నది. నేనే అద్వయమైన ఆ బ్రహ్మను. ఎవరు ఆ అద్వయమైన స్థితి? 'నేను' అదే బ్రహ్మ. రెండు కాదు ఉన్నటి ఒక్కటే - అద్వయం. గురుశిష్యులు రెండు కాదు. ద్వైతం కాదు వున్నది ఒకటే అని తెలియజేస్తున్నారు ఇక్కడ. తరచూ ఈ మంత్రం ఉపన్యాసాలలో అందరూ వినే వుంటారు. వారు కూడా చిన్నప్పటి నుండి వింటూ వుండేవారని శ్రీ మాతాజీ చెబుతూ, ఈ మంత్రాన్ని మరోసారి ఉచ్ఛరించారు. మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహం. ఇదే సృష్టి రహస్యం.

కారణం లేకుండా కార్యముండదు. కార్యములన్నీ కారణము నుండే ఉద్భవిస్తున్నాయి. కారణం లోనే వుంటున్నాయి. మరలా ఆ కారణంలోనే లయమవుతున్నాయి. ఉదాహరణకు తరంగములు ఎంత ఎత్తుగా లేచినా అవి ఆ సముద్రంలోనే పుట్టి, అందులోనే వుండి, ఆ సముద్రంలోనే లయమవుతున్నాయి. అలాగే ఆభరణములు బంగారం నుండి పుట్టి, అందే వుండి, ఆ బంగారంలోనే లయమవుతున్నాయి. అదే విధంగా సుఖదుఃఖాది ద్వంద్వములతో కూడిన దృశ్య ప్రపంచమంతా బ్రహ్మ నుండి పుట్టి అందే వుండి, పరతత్వానుభూతి కలుగగానే, ఆ పరమాత్మ యందే లీనమయిపోతుంది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2021 -**

1 బుధ - శ్రీగురుదశమి, ఏకాహం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

4 శని - శనిత్రయోదశి

5 ఆది - మాస శివరాత్రి, ఉపాధ్యాయ దినోత్సవం

7 మంగళ - అమావాస్య

10 శుక్ర - వినాయక చవితి - తె.జా 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, ఉ. 11గం. సామూహిక గణపతి పూజలు, భక్తసమారాధన.

18 శని - శనిత్రయోదశి.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం, శ్రీ సద్గురుపాదపూజ.

**అక్టోబర్ 2021 -**

1 శుక్ర - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

5 మంగళ - మాసశివరాత్రి

6 బుధ - అమావాస్య

7 గురు - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. ఉ. 8-24 గం.లకు అంకురార్పణ.

12 మంగళ - మూలానక్షత్రం - సరస్వతీ పూజ. సామూహిక కుంకుమ పూజలు.

13 బుధ - దుర్గాష్టమి -

14 గురు - మహర్నవమి -

15 శుక్ర - విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు. నామకరణాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

16 శని - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, అక్షతలు, నగరోత్సవం, శ్రీసద్గురుపాదపూజ.

20 బుధ - ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

30 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీ గుగ్గిల నాయనారు

సేకరణ - మురళి

శ్రీ గుగ్గిల కలయ నాయనారు చోళదేశములోని తిరుక్కడవూరు (ప్రస్థుత తమిళనాడు లోని నాగపట్టణం జిల్లా)లో వేంచేసిన దైవం అమృతఘటేశ్వర (అమృతకేదారేశ్వర) స్వామి. దేవతలు, అసురులు కలిసి అమృత కలశముతో ఇక్కడికి వచ్చిన తరువాత, వారికి నదిలో స్నానం చేయాలనే సంకల్పం కలిగింది. అమృత కలశాన్ని అక్కడ నేలపై ఉంచి ప్రక్కనే ఉన్న నదికి స్నానానికి వెళ్ళారు. తిరిగి వచ్చిన తరువాత తీయబోతే ఆ కలశం లేవలేదు సరికదా, లింగరూపం దాల్చింది. అందువలన ఆ లింగాన్ని అమృతలింగమని, అక్కడ స్వామిని అమృత ఘటేశ్వరుడు అని పిలుస్తారు. మార్కండేయుడు తపస్సుచేసి అమరుడు అయ్యింది ఇక్కడే. ఇక్కడి అమ్మవారి పేరు అభిరామి అమ్మన్. ఈ అమ్మకు పరమభక్తుడైన అభిరామ భట్టార్‌ను రాజుగారి ఆగ్రహము నుండి తప్పించుటకు అమ్మవారు అమావాస్యను పౌర్ణమిగా మార్చివేసింది. అభిరామ భట్టార్ అమ్మవారి మహిమలను తన కీర్తనలద్వారా భక్తులకు అందించారు.

ఇంతటి మహిమాన్వితమైన ప్రదేశములో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు శ్రీ గుగ్గిల. శివునికి గుగ్గిల ధూపము మంచి సేవ అని భావించి ఆలయములోని శివునికి ప్రతి దినము గుగ్గిలముతో ధూపము వేస్తూ పూజ చేసేవాడు. చేతిలో ఒక చిన్న కుంపటి, అగ్ని, గుగ్గిలముతో నిరంతరమూ గుగ్గిల ధూపము వేస్తూ, శివుని అర్చిస్తూ ఉండేవాడు. అందువలననే ఆయనకు “గుగ్గిల కలయ నాయనారు” అను పేరు వచ్చింది.

ఈయన పరమభక్తితో కూడిన శివార్చనకు పరమశివుడు ప్రసన్నుడై, ఈయన భక్తి విశేషమును ప్రపంచమునకు తెలియజేయాలనుకున్నాడు. కాలక్రమేణా గుగ్గిల ఆస్తి అంతా అమ్ముకుని కటిక పేదవాడు అయ్యాడు. ఇల్లు గడవటమే కష్టం అయ్యింది. కుటుంబము పస్తులు ఉంటున్నది. అయినా గుగ్గిల నాయనారు తన గుగ్గిలం సేవలు మానలేదు. ఒక రోజు నాయనారు భార్య “ఆస్తి అంతా అమ్ముకున్నాము.

అమ్మటానికి ఏమీ మిగల లేదు. పిల్లలు పస్తులుంటున్నారు. ప్రతి స్త్రీ భర్త ఉన్నంత కాలము మెడలో ఉంచుకొనవలసిన మాంగల్యము మాత్రము మిగిలి ఉంది" అనుకుంటూ భర్త, పిల్లలు ఆకలితో పస్తులుండటం సహించలేక, మెడలో పసుపుకొమ్ము కట్టుకుని, బంగారముతో చేసిన మాంగల్యము తీసి భర్తకు యిచ్చి దీనిని అమ్మి బియ్యము, సరుకులు తీసుకునిరండి అని పంపింది.

భార్య యిచ్చిన మంగళ సూత్రాలను అమ్మటానికి బయలు దేరిన నాయనారుకు మార్గం మధ్యలో గుగ్గిలం విక్రయించు ఒక వర్తకుడు మూటలను భుజాలపై మోసుకుని ఎదురు వచ్చాడు. అది చూసి నాయనారు బియ్యం కొనుటకంటే గుగ్గిలం కొంటే శివార్చనకు బాగా ఉపయోగపడుతుంది అని ఆలోచించి, మంగళ సూత్రం యిచ్చి గుగ్గిలం కొనుగోలు చేసి, నేరుగా ఆలయానికి చేరుకుని గుగ్గిలము ధూపము వేయుచు భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు. ఇంటి దగ్గర పిల్లలు ఆకలికి అలమటించి సొమ్మసిల్లి నిద్రపోయారు. ఝాము రాత్రి అయినా భర్త ఇంటికి రాలేదు, పైగా బంగారం తీసుకు వెళ్ళాడు, ఏమైందోనని భార్య తల్లడిల్లిపోయింది. రక్షింపుమని పరమేశ్వరుని మనసారా ప్రార్థించింది. నాయనారు భక్తికి, భార్య సేవా నిష్ఠకు పరమేశ్వరుడు సంతసించి, భార్యకు దర్శనమిచ్చి సకల సౌభాగ్యాలను ప్రసాదించాడు. ఆమె పరమానంద భరితురాలై, పరమేశ్వరుని వేనోళ్ళ స్తుతించి ప్రణామములర్పించింది. వంటచేసి పిల్లలకు తినిపించి, భర్త కొరకు చూస్తూ కూర్చుంది. ఈశ్వరుడు నాయనారును ఇంటికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. శివాజ్ఞతో ఇంటికి వచ్చిన నాయనారుకు ఇంటిలోని భాగ్యం చూసి చకితుడై భార్యను అడిగాడు. భార్య చెప్పినది విని, నాయనారు పరమేశ్వరుని అనుగ్రహానికి పరమానంద భరితుడై శివుని వేనోళ్ళ కీర్తించాడు. ఈ భాగ్యమంతా శివునిదేనని భావించి శివభక్తుల సేవకు, శివుని సేవకు వినియోగించాడు.

తిరుప్పనందాళ్ లో శ్రీ అరుణసతీశుని దేవాలయము కలదు. ఒక రాక్షసరాజు కుమార్తె పుత్రుని కొరకు ప్రతి రోజు ఈ శివలింగాన్ని అర్చించేది. ఒకరోజు ఆ లింగమును పుష్పమాలతో అలంకరించుటకు ప్రయత్నించగా, ఆమె వస్త్రము అడ్డురావటముతో చేతులు పైకి

ఎత్తలేకపోయింది, అప్పుడు ఆమె మాల అలంకరించుటకు వీలుగా శివలింగము తానే ప్రక్కకు ఒరిగి మాల వేయించుకున్నారు. అప్పటినుంచి ఆ లింగము అలా ప్రక్కకు ఒరిగే ఉండి పోయింది. ఆ లింగమును సరిగా నిలబెట్టుటకు చాలామంది అనేకవిధములుగా ప్రయత్నం చేశారు గాని ఫలితం లేదు. చివరకు అక్కడి రాజుగారు లింగానికి మోకులు కట్టి ఏనుగులతో లాగించారు. అయినా ప్రయోజనము లేదు.

శ్రీ గుగ్గిల నాయనారు అరుణ సతీశుని దర్శనార్థం వచ్చినప్పుడు ఈ విషయము తెలిసి, తాను కూడ ప్రయత్నము చేద్దామని, శివలింగానికి త్రాడు బిగించి కట్టి, త్రాడు రెండవ కొన తన మెడకు కట్టుకొని శివుని ధ్యానిస్తూ లాగాడు. లింగము యథా స్థితికి వచ్చింది. అక్కడ చేరిన భక్తులందరూ హర్షధ్వానాలు చేశారు.

రాజు గారు "ఈతడు భక్తితో చేసినందువలనే ఇది సాధ్యపడింది" అని గ్రహించి, నాయనారు భక్తిని అనేకవిధములుగా కొనియాడి, గౌరవించి, సత్కరించారు. నాయనారు భక్తి ప్రపత్తులు దేశమంతా వెల్లడయ్యాయి. శ్రీ గుగ్గిల నాయనారు బ్రతికినంత కాలము శివసేవలోను, శివభక్తుల సేవలోను గడిపి అంత్య కాలమందు శివసాయుజ్యం చెందారు.

**మన ఆశ్రమ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బంది అవసరార్థులకు నిరంతరం వైద్యసేవ అందిస్తూ వున్నారు. జులై 2021లో 1124 పేషంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందించటమే కాకుండా, 24 కాన్పులు, 2 ఇతర శస్త్ర చికిత్సలు పూర్తిగా ఉచితముగా చేయడం జరిగింది. ఈ మహత్కార్యానికి సహాయ సహకారాలు అందించిన భక్తులు మరియు దాతలకు శ్రీ గురుదేవులు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.**

**కార్య నిర్వాహక వర్గము**

**SHKVPB Trust Hospital**

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

12-5-1966 : ఈ రోజు నుండి 22.7.66 వరకు ఉత్తర దేశ యాత్ర జరిగింది.

29-7-1966 : శ్రీ బాబు భక్తులతో మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామికి పానకం సమర్పిస్తే, సగం స్వామి స్వీకరించిన తరువాత శంఖంలోకి వచ్చేసింది. (ఎక్కిళ్ళు వచ్చాయన్నారు). నరసింహ స్వామి నోటిలో సాలిగ్రామము, శంఖ చక్రాలు ఉన్నాయని హారతి వెలుగులో చూపించారు. శ్రీ బాబు చిన్నతనంలో నేను యిక్కడకు యాత్రకు వచ్చినపుడు శ్రీ నృసింహస్వామిని ప్రత్యక్షంగా దర్శిస్తూ గబగబా ఆలయ గోపురం ఎక్కేశాను. ఆ దివ్యానంద అనుభూతిలో నేను శరీరం మరచి గోపురం పైనే చాలా సేపు ఉండిపోయాను. నాతో వచ్చిన వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాళ్ళు దింపలేక పోయారు. అప్పుడు వారందరూ బిగ్గరగా రామ నామం చాలా సేపు చేశాక నేను మళ్ళీ యధా స్థితికి వచ్చి గోపురం దిగాన'ని చెప్పారు.



31-7-1966 : అధిక శ్రావణ పూర్ణిమ. గుంటురులో పాండుగారింట్లో శ్రీ బాబు బోధ చెబుతూ "ఇది భగవంతుడు మనకు అదనంగా ప్రసాదించిన పూర్ణిమ. జన్మ పరంపరల నుండి మానవుని తరింపచేయ గలిగినది శ్రీ శివ పంచాక్షరీ మహౌషధం. ఆ ఔషధ సేవకు పథ్యం విషము, అంటే విషయాదులకు దూరంగా ఉండటమే. విషము కూడా ఔషధముగా అనేక వ్యాధులను హరిస్తుంది. అవసాన దశలో ఉన్న ప్రాణాన్ని తిరిగి నిలపగలుగుతుంది.

'ఓం నమశ్శివాయ' అనే ఆరు అక్షరాలు కామ క్రోధాది అరిషడ్వర్గములను శమ దమాది షట్క సంపదగా మార్చి వేయగలవు. నేను కాశీలో గంగానదీ స్నానం చేస్తూ పంచాక్షరీ మంత్రాధిష్ఠాన

స్వరూపుడైన విశ్వనాధుడే నాలో దివ్య కాంతులతో ప్రకాశిస్తున్న అనుభూతిలో సాయకాలం 6 గంటల వరకు గంగలో అలాగే నిలబడి పోయాను. గంగాదేవికి సాయంకాల హారతులు జరుగుతున్న సమయంలో నాకు శరీర స్పృహ కలిగింద'ని చెప్పారు.

30-8-1966 : నిజ శ్రావణ పూర్ణిమ. గుంటూరులో గురుపూజ జరిగింది.

31-8-1966 : అసత్యమైన ప్రపంచమును సత్యమైన దానిగా చూపిస్తూ, దానికి మూలమైన సత్య వస్తువును మనకు కనబడనీయకుండా అసత్యమనిపించేదే మాయ. ఆ మాయను రహితం చేసేవాడే మా యశోదా నందనుడు. వాడే మాయమ్మ. ఆ యమ్మను నమ్మితే మాయ దరి చేరదు" అన్నారు. "శాస్త్రాలు చదవక పోయినా గోరా, నందనారు, గుహుడు, శబరి ఆ నామమును నమ్ముకుని తరించిన వారే" అన్నారు.

7-9-1966 : శ్రీకృష్ణాష్టమి. బెజవాడలో శేషంరాజుగారింట్లో జరిగింది.

18-9-1966: వినాయక చవితి పాండుగారింట్లో జరిగింది.

29-9-1966 : భాద్రపద పూర్ణిమ. పాండుగారింట్లోనే పూజ జరిగింది.

15-10-1966 : నవరాత్రులు మేడబాబుగారింట్లో మొదలు. సుగుణమ్మ గారు బ్యాండు మేళంతో అందరిని ఆహ్వానించారు.

18-10-1966 : తమ ఉపన్యాసంలో 'హస్తమస్తక సంయోగం అంటే జీవాత్మ, పరమాత్మల కలయిక' అని శ్రీ బాబు చెప్పారు.

4-11-1966 : (మేడబాబుగారింట్లో) బోధ - **"హరి హరీ నారాయణా ఆదినారాయణా కరుణించి మమ్మేలు కమల లోచనుడా"** అని శ్రీ బాబు పరవశులై చాలా సేపు పాడారు. వయోలిన్ మీద కూడ సూర్యనారాయణ శాస్త్రిగారిని వాయించమన్నారు. శ్రీ బాబు "పడవ నడిపే వాళ్ళు, పొలంలో పనిచేసే వాళ్ళు యీ రామ నామన్ని స్మరిస్తూ మైమరచిపోతారు. అటువంటి అమాయకులకు ఆ రామనామ మాధుర్యం అందుతుంది గాని కపట వర్తనులకు అది అందదు. రామ నామమే గురు స్వరూపము. అది జితేంద్రియుని ఓలలాడించినది. త్యాగయ్యను త్యాగ బ్రహ్మముగా మార్చినది" అని చెప్పారు. -సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు -రమణ ప్రసాద్

# బోధల బావా

"బోధలబావా సంకీర్తన మధ్యలో ఒకసారి అందరివంక చూశాడు. చెట్టును ఆనుకున్న వ్యక్తి నిద్రపోతున్నట్లున్నాడు. బాబా ఆయన వద్దకు వెళ్ళి "నాయనా! ఇంత మహదానందంగా సంకీర్తన జరుగుతుండగా నిద్ర ఎలా పోగలుగు తున్నావు? తమస్సును విడిచి పెట్టునాయనా! మధురాధిపతి మధుర నామ సంకీర్తన మాధుర్యాన్ని గ్రోలు" అంటూ "హరేరామ హరేరామ" అనే షోడశాక్షరీ నామం సంకీర్తన చేస్తూ అందరినీ చేయమన్నారు. ఈ నామం మహిమ కలది. కల్మషనాశిని. ఈ మంత్రం జపించిన వారికి షోడశ గుణాలు హరిస్తాయి. అంటే కామ క్రోధాదులు ఆరు, సత్వరజోస్తమో గుణాలు, మూడు అవస్థలు, నాలుగు అంతఃకరణాలూ హరించి ఆనందమే మిగులుతుంది."



"బ్రహ్మానందంలో సంకీర్తన సాగుతోంది. సంకీర్తన చేస్తున్న బావా ఆ చనిపోయిన వ్యక్తిని చేతితో తాకారు. కరెంటు తీగకు తాకిన బల్బు వెలిగినట్లు ఆ వ్యక్తి వెంటనే పునర్జీవితుడైనాడు. "కృష్ణ కరెంటు" తాకగానే కాళీయుని విషమే విరిగిపోతే త్రాచుపాము విషం ఏమి లెక్క? అతని వెంట వచ్చిన వారంతా ఆశ్చర్యపడి జరిగిన విషయం బావాకు చెప్పారు. బావా ఎంతో వినయంగా "నాదేముంది బాబూ! నిమిత్త మాత్రుడను. దాసులకు దాసుడను. ప్రభువు నన్ను చొక్కాగా ధరించి తన భక్తుణ్ణి రక్షించుకొన్నాడు" అన్నాడు. ఎంత నిరహంకారి! మహాత్ములంతా అంతే. నేను మహాత్ముడననిగానీ, భక్తుడననిగానీ, జ్ఞానిననిగానీ,

పవిత్రుడను అనిగానీ తమకుతాము చెప్పుకోరు.”

“నామ సంకీర్తన ఎంత గొప్పదో చెబుతూ జితేంద్రియుడు అన్నాడు “భగవన్నామ్ బహుత్ మీఠేహై । పీనే పీనే అపనే ఆపకో భూల్‌జానా హై”అని. రామనామ మాధుర్యాన్ని గ్రోలిన కొలదీ తన్ను తాను మరచిపోతాడు. ఆ మాధుర్యం ఎటువంటిదో ఆ జితేంద్రియుడికే తెలియాలి. శబరి పెట్టిన ఎంగిలి పళ్ళు పరమానందంగా ఆరగించాడు రామచంద్రుడు. భక్తుల ఎంగిలిలో ఉన్న మాధుర్యం భగవానునికే తెలియాలి.”

“బోధలబావా వంటి సద్గురువు లభిస్తే జన్మ సార్థకత అవుతుంది. వారి దివ్య చరణాలను స్పృశిస్తే చాలు సర్వ పాపాలూ హరిస్తాయి, అంతేగాని వారికి మన పాపాలు మలినాలు ఏవీ అంటవు. అట్టి మహాత్ములు లభ్యమైతే వారి పాదాలను అశ్రయించి సేవించాలి. వారి పాద ధూళి శిరస్సున ధరించాలి.అంతరంగవాసి అయిన రంగడిని మనసారా స్మరించితే మనస్సుతో చేసిన పాపాలు అన్నీ పోతాయి. నోటితో  నామ సంకీర్తన చెయ్యండి. జిహ్వతో చెప్పిన అబద్ధాలు, పాపాలు పోతాయి. చేతితో తాళం వేస్తే చేతులతో చేసిన పాప కర్మలు హరిస్తాయి. కనుక మానవులను తరింప చేయటానికి భక్తి ఒక్కటే చాలు. ఏ శాస్త్ర పరిచయమూ అక్కరలేదు. ఇది సత్యం. రంగడిని మీ అంతరంగంలో నిలపండి. భవసాగరంనుండి తరించండి. ఆ రంగడు మంగళకరుడు. ఆయన ఎక్కడవుంటే అక్కడ శాంతి, ఆనందం నెలకొంటాయి. అక్కడ సంకటాలకు తావులేదు. మరి ఆ రంగణ్ణి మీ మదిలో ఏల నిలుపుకోరాదు? రంగడు సదా మీ మదిలో నిలచి రక్షించుగాక.”

ఒక సంవత్సరం వర్షంలేక ప్రజలు చాలా కష్టాలు పడుతున్నారు. కార్తీకమాసంలో ఒక వర్షం కురిసింది. బోధల కొంత ధాన్యాన్ని అప్పు పుచ్చుకుని చేనులో చల్లాడు. ఆ రోజు పండరీపురానికి యాత్రకు పోతున్నవారు “మేము ఇంతవరకు భోజనం చేయలేదు మా ఆకలి తీర్చండి” అని అడిగారు.

ఇల్లంతా వెతికితే కొన్ని పుచ్చిన జొన్నలు ఉన్నాయి. పుత్రుడైన యామాజీని పిలిచి “నాయనా అతిథులకు పుచ్చిన జొన్నలు ఈయకూడదు. నేను చల్లిన ధాన్యాన్ని ప్రోవుచేసి జల్లించి వాటిని శుభ్రం చేసి సాధువులకు ఇచ్చి ఈ

పుచ్చిన ధాన్యాన్ని పొలంలో జల్లు” అని చెప్పాడు బోధల. యామాజీ తండ్రి చెప్పినట్లే చేశాడు. ఆ పుచ్చిన ధాన్యం పండరీనాధుని కృపచేత, అంకురించి చక్కగా పెరిగితే ఆ ఊరి ప్రజలు ఆశ్చర్యపోతూ పొలం దగ్గరకు వచ్చి చూశారు.

ఆ పొలంలో విస్తారంగా సొరకాయలు కాసాయి. అక్కడివారు ఆశ్చర్యంతో ఆ కాయను కొట్టిచూస్తే అది జొన్నలతో నిండి వుంది. ఈ వార్త తెలిసిన తురుష్కరాజు ఈ వింతకు కారణము ఏమని అడుగగా, బోధల “నాకేమి తెలియదు ఇది పండరీనాధుని లీల అని చెప్పాడు.” అప్పుడు ఆ తురుష్కుడు బోధల ఏదో ఇంద్రజాలం చేశాడు అని మాంసాన్ని తెప్పించి దాన్ని ‘తిను’ అని ఆజ్ఞాపించాడు.

పండరినాధుని కృపచే అది తులసిగా మారింది. దానిని చూసి తురుష్కరాజు విస్మయం చెంది బోధలకు వందనం చేసి “మీకు ఏమి కావాలో అడగండి ఇస్తాను” అన్నాడు. బోధల “కామధేనువును ఆశ్రయించినవానికి కొరతలేనట్లు, శ్రీ రామ నామ జపశీలుడనైన నాకేమీ కొరత లేదు” అని ఇంటికి వెళ్ళి శ్రీ పాండురంగని కీర్తిస్తూ ఆనంద భరితుడై కాలం గడిపి చివరకు పాండురంగనిలో ఐక్యం అయ్యాడు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి వారణాసి వెంకట సుబ్బలక్ష్మి (శేఖరంగారి భార్య) గారు 21-8-21 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD